క్లుప్తంగా

ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



శింగనమల: చాగల్లు రిజర్వాయర్ ముంపు గ్రామాలైన శింగనమల నియోజకవర్గంలో ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లికి ఏన్నేళ్లయినా ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ రాలేదని , వీటినైనంత త్వరగా అందజేయాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కోరారు. శనివారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. చాగల్లు ముంపు గ్రామాల్లో ఈ రెండు గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రాలేదన్నారు. నియోజకవర్గంలో గ్రామాల్లో పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు వెళ్లడానికి సమయానికి బస్సులు లేవన్నారు. వీటినైనంతవరకు విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించాలని కోరారు.

పిల్లల ఎదుగుదలపై దృష్టి సారించాలి

గుంతకల్లు రూరల్: పిల్లలు ఎదుగుదలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి సూచించారు. శుక్రవారం నక్కనదొడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ పద్మావతి ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు.

నార్పల: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీడీపీఓ భారతి పేర్కొన్నారు. బొందలవాడ అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం పోషణ్ పక్వాడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలను రోజూ ఆహారంలో తీసుకోవాలన్నారు.

లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి విరాళం

గుంతకల్లు రూరల్: మండలంలోని బుగ్గ సంగాల గ్రామానికి చెందిన రాము అనే భక్తుడు కసాపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి శుక్రవారం రూ.50,116 విరాళాన్ని అందించారు. ఆలయ నిత్యాన్నదాన సత్రం నిర్వహణకు నగదును విరాళంగా అందజేసినట్లు దాత రాము తెలిపారు. ఈసందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు తలారి పరశురాముడు ఆధ్వర్యంలో దాత కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

గార్లదిన్నె: పెనకచెర్లకు చెందిన ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసును శుక్రవారం గార్లదిన్నె పోలీసులు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన దళిత ఓబిలేసును అంగడి వ్యాపారం విషయంలో అదే గ్రామానికి చెందిన గంగమ్మ, రాము, శేఖర్, అంజి, రవి అనే ఐదుగురు కులం పేరుతో దూషించారు. బాధితుడి ఫిర్యాదు మరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సుంకం వసూలు వేలం నాలుగోసారీ వాయిదా

గుంతకల్లుటౌన్: పట్టణంలో దినసరి, వారాంతపు మార్కెట్, జంతువధశాల, మాంస దుకాణాల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కును కల్పించేందుకు శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన వేలం పాట నాలుగోసారి కూడా వాయిదాపడింది. సర్కారు వారి పాటను రూ.40.60 లక్షలు నిర్ణయించగా రూ.41 లక్షల వరకు వేలంపాడిన కాంట్రాక్టర్లు అంతకుమించి తమకు చేతకాదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మున్సిపాల్టీ ఆదాయాన్ని తగ్గించి పాడుతామంటే కుదరదని, అవసరమైతే మున్సిపల్ సిబ్బంది ద్వారా సుంకం వసూలు చేయిస్తామని కమిషనర్ బండి శేషన్న తేల్చి చెప్పారు. మున్సిపల్ ఆర్ఓ నాసిర్‌హుసేన్, ఆర్ఐ ఎర్రిస్వామి, సీనియర్ అసిస్టెంట్ మురళీ పాల్గొన్నారు.

నేడు సుంకం వసూలు వేలం

గుత్తి: మున్సిపాలిటీలో దినసరి మార్కెట్ సుంకం వసూలు కోసం శనివారం మున్సిపల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నారు. ఈమేరకు కమిషనర్ శరత్ చంద్ర శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

వృద్ధాశ్రమం తనిఖీ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో గల అనురాగ వృద్ధాశ్రమాన్ని ఆర్‌డీఓ జె.రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఉదయం వృద్ధాశ్రమంలో వృద్ధులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యోగక్షేమాలు, ఆశ్రమంలో భోజనవసతి, ఇతర సౌకర్యాల గురించి ఆరాతీశారు. వృద్ధులకు అవసరమైనన్నీ టాయిలెట్లు నిర్మించాలని, దాతల సహకారంతో పౌష్టికాహారం అందేలా చూడాలని వారు అధికారులను విన్నవించారు. ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని వారు హామీ ఇచ్చారు. ఆశ్రమంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేయించాలని, నెలకోసారి మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేయించాలని వార్డు సచివాలయ కార్యదర్శులకు ఆర్‌డీఓ, కమిషనర్ సూచించారు.

రీ సర్వేకు సిద్ధంగా ఉండండి

యల్లనూరు: గ్రామ సర్వేయర్లు రీ సర్వేకి సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. శుక్రవారం సర్వేయర్లకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలన్నారు. అలాగే ఏవైనా భూ తగాదాలు ఉంటే ముందుగా సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలన్నారు. మండల సర్వేయరు షర్వానీ, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

గుంతకల్లు: పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఎస్పీ నర్సింగప్ప సిబ్బందికి సూచించారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో నేర సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమాచారహక్కు, స్పందన, ఇతర కమిషన్ల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్‌బీడబ్ల్యూ వారెంట్స్‌ను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కోర్టులో నడుస్తున్న ముఖ్యమైన కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ముద్దాయిలకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేరాల రేటును తగ్గిస్తూ, కేసులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో నివారించాలన్నారు. సీఐలు రామసుబ్బయ్య, గణేష్, మహేశ్వరరెడ్డి, హరినాథ్, శేఖర్, ఎస్ఐలు సురేష్, గోపాలుడు, చాంద్‌బాషా, సత్యనారాయణ, రామకృష్ణ, వెంకటస్వామి, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ నర్సింగప్ప

పంట నష్టం జాబితా రూపొందించండి

శింగనమల: అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంట నష్టంపై జాబితా తయారు చేయాలని ఏఓ చిన్నమ్మ తెలిపారు. శుక్రవారం పెరవలి, జూలాకాల్వ, కొరివిపల్లి ఆర్బీకేలను తనిఖీ చేశారు. పంట పొలాలను పరిశీలించి, ఆర్బీకేలలో రైతులతో మాట్లాడారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం వచ్చేలా జాబితా పంపామని తెలిపారు. శింగనమల చెరువు కింద సాగు చేసిన వరి పంట సర్వే నంబర్ ప్రకారం పరిశీలించి పంట పెట్టని రైతులను పంట జాబితా నుంచి సరిచేసుకోవాలని ఏఈఓకు సూచించారు. ఏఈఓ అక్కమ్మ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



పెరవలిలో ఆర్బీకేలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ చిన్నమ్మ

యర్రగుంట్ల పీహెచ్‌సీ డాక్టర్ల బాధ్యతల స్వీకరణ

గార్లదిన్నె: యర్రగుంట్ల పీహెచ్‌సీ డాక్టర్లుగా ఇద్దరు శుక్రవారం బాధ్యతలు స్వీకరించినట్లు గార్లదిన్నె పీహెచ్‌సీ డాక్టర్ షమీన్‌తాజ్ పేర్కొన్నారు.ఈసందర్భంగా డాక్టర్ షమీన్‌తాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం యర్రగుంట్లలో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడంతోపాటు డాక్టర్ హానీష, డాక్టర్ దిలీప్‌ను నియమించిందన్నారు.

చీనీ కాయల వేలం నిర్వహించాలి

గార్లదిన్నె: అనంతపురం మార్కెట్ యార్డులో చీనీ కాయల కొనుగోలుకు బహిరంగా వేలం నిర్వహించాలని రాయలసీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ పేర్కొన్నారు. శుక్రవారం మర్తాడులో రాయలసీమ రైతు సంఘం ఆధ్వ ర్యంలో రైతు సమస్యలపై నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం మార్కెట్ యార్డులో వ్యాపారస్తులు మార్కెట్ యార్డు సిబ్బందితో కలసి వేలం లేకుండా ధరలు నిర్ణయించడంతో చీనీ రైతులు నష్టపోతున్నారన్నారు. రైతులు రామకృష్ణారెడ్డి, రామలింగయ్య, తాతయ్య, వెంకటస్వామి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు ఎదుర్కోవడంపై అవగాహన



వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న కర్నూలు సెకండ్ బెటాలియన్ సిబ్బంది

శింగనమల: వరదలు, కాలువలు, చెరువుల్లో ప్రమాదాలను ఎదుర్కోవడంపై శింగనమల చెరువులో శుక్రవారం సత్యసాయి జిల్లా వలంటీర్లకు కర్నూలు సెకండ్ బెటాలియన్ సిబ్బంది అవగాహన కల్పించారు. సెకండ్ బెటాలియన్ హెడ్‌కానిస్టేబుల్ రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అపద మిత్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. వరదలు, విపత్తులు వచ్చినప్పుడు అపదలో ఉన్న వారిని ఎలా కాపాడాలో , గ్రామాల్లో కొంతమందికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు, వై ఎస్సార్ కడప జిల్లాలో అవగాహన కార్యాక్రమాలు చేపడుతామన్నారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి, కర్నూలు సెకండ్ బెటాలియన్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇనాం భూముల ఆక్రమణపై ఫిర్యాదు

గుత్తి రూరల్: గొందిపల్లిలోని ఆంజనేయస్వామి ఇనాం భూములను అర్చకుడు రవికుమార్ అక్రమంగా తన ఆధీనంలో ఉంచుకున్నాడని ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో గొందిపల్లికి చెందిన ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆదినారాయణ, పాండురంగస్వామి, శివ శంకర్, శ్రీరాములు మాట్లాడుతూ గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి 1935లో సర్వే నంబర్ 317, 322లోని 36 ఎకరాల భూమిని తమ పూర్వీకులకు ఇనాంగా ఇచ్చారన్నారు. అయితే జక్కలచెరువు ఆంజనేయ స్వామి ఆలయ అర్చకుడు రవికుమార్ తమ గ్రామంలోని ఆలయానికి సంబంధించిన మాన్యం భూములు అంటూ 18 ఎకరాల భూమిని కౌలుకు ఇచ్చి అక్రమంగా ఆధీనంలో ఉంచుకున్నాడన్నారు. రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ రికార్డులలో భూములు ఎవరి అనుభవంలో లేనట్లుగా చూపుతున్నాయని తెలిపారు. తగిన ఆధారాలు లేకుండా అర్చకుడు రవికుమార్ అక్రమంగా భూములు తన ఆధీనంలో ఉంచుకున్నాడని వెంటనే వాటిని తమకు అప్పగించాలని వారు తహసీల్దార్‌ను కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ తమ రికార్డుల ప్రకారం భూములు దేవాదాయశాఖవిగా పేర్కొంటామన్నారు. గ్రామస్తులు, అర్చకుడి మధ్య ఉన్న సమస్యను దేవాదాయ శాఖ అధికారులు పరిష్కరించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటస్వామి, ఓబుళపతి, రామకృష్ణ, రంగస్వామి పాల్గొన్నారు.

శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభం

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్ ఆర్‌వీ స్వామి కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సీతా సమేత కోదండరామస్వామి అలంకారంతో సీతారాముడు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు సీతారామలక్షులను దర్శంచుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఆశ్వత్థరంగయ్య, అధ్యక్షుడు భూమా హరినారాయణ, కార్యదర్శి భూమా విజయ్‌కుమార్, ఉపకార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సత్యనారాయణప్రసాద్ పాల్గొన్నారు.

బాట సుంకులమ్మ తిరునాల ప్రారంభం

పుట్లూరు: మండలంలోని నాయకునిపల్లి సమీపంలో బాట సుంకులమ్మ తిరునాల శుక్రవారం ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. సుంకులమ్మ అమ్మవారి ఆలయంతో పాటు ఆంజనేస్వామి ఆలయం, అక్కదేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాట సుంకులమ్మ ఆలయం వద్ద భూమిరెడ్డి ఫార్మర్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సొసైటీ సభ్యులు పుట్లూరు ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీడీఓ యోగానందరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాఘవరెడ్డి

నేడు ఇమామ్, మౌజన్లకు ఇంటి పట్టాల పంపిణీ

తాడిపత్రి టౌన్: స్థానిక వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో శనివారం ఉదయం ఇమామ్‌లు, మౌజన్లకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి పట్టాల పంపిణీ చేయనున్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

యాడికి: మండల కేంద్రంలో శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి, పెద్దమ్మ గుడి ఎదురుగా నిర్మించిన నూతన భవనాలను ఆదివారం ఉదయం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు తెలిపారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం



తాడిపత్రిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తాడిపత్రి టౌన్ : ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసం శుక్రవారం ప్రారంభమైంది. నెలవంక కనిపించడంతో శుక్రవారం ఉపవాస దీక్షలను ముస్లింలు ప్రార ంభించారు. పట్టణంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని అన్ని మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు.

పామిడి: మండలవ్యాప్తంగా మసీదుల్లో పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యారు. ఈసందర్భంగా మసీదుల్లో వారు నియమనిష్టలతో కూడిన ఉపవాస ప్రార్థనలు ఆచరించారు. నెల రోజుల పాటు ముస్లింలు ఈ ఉపవాస దీక్షలను భక్తిశ్రద్ధలతో పాటించనున్నారు.

రమాదేవి హంతకుణ్ని ఉరి తీయాలి



రమాదేవి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మందకృష

నార్పల: దళిత యువతి రమాదేవి హంతకుడు జాఫర్‌ను వెంటనే ఉరి తీయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. శుక్రవారం వారు బొందలవాడ గ్రామానికి వెళ్లి రమాదేవి సమాధి వద్ద నివాళులర్పించారు. ఘటనపై శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

శింగనమల: అకాల వర్షాలతో శివపురం, సీ.బండమీదపల్లి, చక్రాయిపేట , పోతురాజుకాల్వ గ్రామాల్లో దెబ్బతిన్న వరి పొలాలను గుత్తి ఏడీఏ నారాయణ నాయక్ శుక్రవారం పరిశీలించారు. అకాల వర్షాలతో గింజలు రాలిపోయాయని, గడ్డి తప్ప పంట లేదని రైతులు ఏడీఏకు వివరించారు.

క్షయ నివారణకు కృషి చేద్దాం

తాడిపత్రి టౌన్ : క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ నయమవుతుందని ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి రామలక్ష్మి, క్రిష్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం జరిగింది. స్థానిక టీబీ సూపర్‌వైజర్ సునిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు టీబీ రోగులు, వైద్యులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీబీ లక్షణాలున్న వారు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని రోగం నిర్ధారణైన తర్వాత క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. క్షయ రోగులకు ప్రభుత్వం ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం కొన్ని నెలలుగా క్షయ రోగులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఫయాజ్ ట్రస్ట్ చైర్మన్ ఫయాజ్‌బాషాను వైద్యులు సన్మానించారు.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప ఆధ్వర్యంలో శుక్రవారం టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీబీపై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. టీబీ యూనిట్ వైద్యులు విష్ణుమూర్తి, ఎల్లా రాముడు, యామిని, టీబీ యూనిట్ , పీపీ యూనిట్ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, హ్యాండ్స్, సీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



తాడిపత్రి టౌన్ : ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

పెద్దవడుగూరు: గ్రామీణ ప్రాంతాల్లో క్షయ నివారణకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పెద్దవడుగూరు ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీనివాసబాబు పేర్కొన్నారు. శుక్రవారం పెద్దవడుగూరు, క్రిష్టిపాడు గ్రామాల్లో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గువుంటే క్షయ కావొచ్చని, అలాంటి వారు ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గుంతకల్లు రూరల్: మండంలోని వెంకటాంపల్లి వద్ద ఈనెల 20న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో మృతి చెందాడు. రూరల్ ఏఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు..అనంతపురంలోని మారుతీనగర్‌కు చెందిన హమీద్ స్నేహితులు రషీద్, రఫీతో కలిసి ఈనెల 20న బైక్‌పై ఎల్లార్తి దర్గాకు వెళ్లి తిరుగుపయనమయ్యారు. వెంకటాంపల్లి వద్ద వారి బైక్‌పై నుంచి పడి హమీద్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని గుంతకల్లు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం అనంతపురం తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

తాడిపత్రి టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వార్డు సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లను ఆదేశించారు. స్థానిక సుంకులమ్మపాలెంలోని 12 వార్డు సచివాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే తనిఖీ చేశారు. అనంతరం ప్రజల నుంచి స్పందనలో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి సంబంధించిన రికార్డులను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రభుత్వ పథకాల అమలుపై ఆయన ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలని వార్డు సచివాలయ సెక్రటరీ, వలంటీర్లను ఆదేశించారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.



ప్రభుత్వ పథకాల అమలుపై వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోరు తవ్వకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: స్థానిక సీబీరోడ్డు రామచంద్రాలాడ్జి సమీపంలో శుక్రవారం పయాజ్ ట్రస్ట్ చైర్మన్ హీరాపురం ఫయాజ్ బాషా ఆధ్వర్యంలో నీటి బోరు తవ్వకం ప్రారంభించారు. రామచంద్రాలాడ్జి కాలనీలో కొద్ది రోజులుగా నీటి సమస్య నెలకొంది. ఈనేపథ్యంలో కాలనీ వాసులు సమస్యను ఫయాజ్ ట్రస్ట్ చైర్మన్ ఫయాజ్‌బాషాకు విన్నవించారు. ఆయన వెంటనే స్పందించి కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి రూ.2 లక్షలతో నీటి బోరు, మోటర్, మూడు ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో కాలనీ ప్రజల నుంచి హర్షం వ్యక్తంచేశారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, కార్యదర్శి షబీ, నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, రియాజ్, జాఫర్, తమీమ్, యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

యాడికి: వేములపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచు, సీపీఐ సీనియర్ నేత వీకే వెంకటరామిరెడ్డి(85)అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గ్రామానికి చేరుకొని వెంకటరామిరెడ్డి మృత దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం మృతుని సోదరుడు వీకే విశ్వనాథరెడ్డి, మృతుని కుమారుడు వీకే ప్రదీప్ రెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, నగరూరు, వేములపాడు సర్పంచులు రుక్మాంద రెడ్డి, ఓంకారమ్మ, నాయకులు సాంబశివుడు, కొమ్ము ప్రసాద్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, రమానందరెడ్డి తదితరులు ఉన్నారు. కాగా వీకే వెంకటరామి రెడ్డి అంత్యక్రియలు శనివారం ఉదయం గ్రామ సమీపంలోని వారి వ్యవసాయ క్షేత్రంలో జరుగుతాయని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



టెన్త్ మోడల్ పరీక్షల్లో టాపర్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

గుత్తి: వారం రోజుల క్రితం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ టెన్త్ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శుక్రవారం కోట ఉన్నత పాఠశాలలో బహుమతులు ప్రదానం చేశారు. మహర్షి దయానంద గురుకుల పాఠశాల విద్యార్థి గణేష్ కుమార్ మండల టాపర్‌గా నిలిచాడు.ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, కోట ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం రఘురాం, మహర్షి పాఠశాల కరస్పాండెంట్ విద్యాధర్, ఏవీఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ జానీ మాట్లాడుతూ భయం వీడి పరీక్షలు ప్రశాంతంగా రాయాలన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు దేశాయి నాగరాజు, సునీల్, సీఈఓ శ్రీరాములు టీచర్ నాగమణి, బలిజ సంఘం మండల ఉపాధ్యక్షులు రమేష్‌బాబు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల్లోకి దిగితే చర్యలు

యల్లనూరు: తిరుమలాపురం గ్రామ సమీపంలోని చెరువు భూముల్లోకి ప్రభుత్వ అనుమతి లేకుండా దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రమాదేవి హెచ్చరించారు. సర్వే నెంబరు 52–2లో 4.84 సెంట్లల్లో ఎకరన్నర మాత్రమే వివాదాస్పదంగా మారింది. అయితే గ్రామంలో ఇరువర్గాలు తమదంటే తమదని వాదనకు దిగుతున్నారు. అయితే ప్రస్తుత సర్పంచ్ రామాంజులరెడ్డి కుమారుడు రాఘవేంద్రారెడ్డికి పూర్వపు ఆస్తి. పట్టా రాఘవేంద్రారెడ్డి పేరుతో ఉండటంతో శుక్రవారం జేసీబీతో మట్టిని చదును చేస్తుండగా అదే గ్రామానికి చెందిన రవిచంద్రారెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, రామకృష్ణ జేసీబీతో పనులు చేస్తున్న ప్రదేశానికి చేరుకుని అడ్డుకుంటున్నారని తమ ఆస్తి తమకు కాకుండా ఎలా ఉంటుందని రాఘవేంద్రారెడ్డి చెబుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి తమకు హక్కు పత్రాలు ఉన్నాయని అలా కాకుండా దౌర్జన్యం చేస్తే ఎలా అని తహసీల్దార్ రమాదేవి, ఎస్ఐ రామకృష్ణకు తెలియజేశారు. ప్రభుత్వం నుంచి అనమతులు వచ్చే ఎవరూ భూమిలో దిగొద్దని ఇరువర్గాలకు తహసీల్దార్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో దిల్కా శీనా పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మున్సిపాలిటీ పరిధిలోని జెడ్.వీరారెడ్డి కాలనీకి చెందిన శ్రీనివాసులు బైక్‌పై గుత్తిలోకి వస్తుండగా ఎదరుగా మరో బైక్ వచ్చి ఢీ కొంది. ప్రమాదంలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు

గుత్తి రూరల్: మండలంలోని కొజ్జేపల్లిలో ప్రమాదవశాత్తు రైతుకు రేకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులు వ్యవసాయ పనుల నిమిత్తం శుక్రవారం రేకును కత్తితో కోస్తుండగా రేకు తగిలి చేయి తెగింది. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబసభ్యులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు.

కుక్కర్ పేలి మహిళకు తీవ్రగాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కె.ఊబిచెర్లలో వంట చేస్తుండగా కుక్కర్ పేలి ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో వంట చేస్తోంది. అయితే పప్పు ఉడికించిన అనంతరం కుక్కర్ మూత తీస్తుండగా ఒక్కసారిగా పేలి వెంకటేశ్వరమ్మ మొహం, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు.